# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 54 6-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.





## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

- బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్
- ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్
- సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్

2లో

## తెలంగాణ కొత్త గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా

- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లను మారుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు
- తెలంగాణ గవర్నర్‌గా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నియామకం
- ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీ
- ఢిల్లీ మరియు లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ల స్థానాల్లోనూ మార్పులు



# యుద్ధబీభత్సం

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న కల్లోలం



- అమెరికాకు చెందిన చమురు నౌకపై ఇరాన్ మెరుపు దాడి
- నౌక పూర్తిగా మంటల్లో చిక్కిందని పేర్కొన్న ఇరాన్ ప్రభుత్వ వర్గాలు
- ఇరాక్, కువైట్‌ల్లో కూడా రెండు చమురు నౌకలపై దాడి!
- యూఏఈ, అజర్‌బైజాన్, దోహాపై బాంబులు, డ్రోన్లు
- ఇరాన్ నౌకాశ్రయంపై భారీ దాడులతో విరుచుకుపడ్డ అమెరికా
- దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణి, బాంబు దాడులతో విధ్వంసం
- లెబనాన్‌పై దాడుల తీవ్రతను మరింత పెంచిన ఇజ్రాయెల్

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం నానాటికీ పెరుగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ గురువారం ఆరో రోజు ఇరాన్ వ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణులు, బాంబు దాడులతో విరుచుకుపడ్డాయి. ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై పలు దఫాలుగా తీవ్ర స్థాయిలో దాడులు కొనసాగించింది. పలు గల్ఫ్ దేశాలపైనా మరిన్ని డ్రోన్ దాడులకు పాల్పడింది.

- మిగతా 2వ పేజీలో



2లో

## పరుగుల వరదతో ఫైనల్లోకి

- టి20 ప్రపంచకప్‌లో తుది పోరుకు భారత్
- సెమీస్‌లో 7 పరుగులతో ఇంగ్లండ్‌పై గెలుపు
- మళ్లీ చెలరేగిన సంజు సామ్సన్
- బెతెల్ శతకం వృథా
- ఆదివారం న్యూజిలాండ్‌తో ఫైనల్

భారత జట్టు స్కోరు 253 పరుగులు... ఇందులో 18 ఫోర్లు, 19 సిక్స్‌లు.. వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టూ కూడా ఇంత లక్ష్యాన్ని ఛేదించలేదు. ఇక గెలుపు లాంఛనమే, ఫైనల్ చేరడం ఖాయమనే అనిపించింది. కానీ ఇంగ్లండ్ కూడా ఏమాత్రం తగ్గలేదు. భారీ స్కోరును చూసి బెదిరిపోకుండా ఆ జట్టు కూడా 21 ఫోర్లు, 15 సిక్స్‌లతో ఆఖరి వరకూ పోరాడింది... కానీ అదృష్టవశాత్తూ టీమిండియా అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో చివరకు 7 పరుగులతో సూర్యకుమార్ బృందం గట్టెక్కింది.



## జగన్ జీతం తీసుకోవడం లేదు

- వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై అయ్యన్నపాత్రుడు అసహనం
- గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదని వ్యాఖ్య
- వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదన్న స్పీకర్

# సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!



- సంఖ్యాబలం లేక రాజ్యసభ పోటీలో నిలవని ప్రతిపక్ష బీఆర్ఎస్
- ఎమ్మెల్యేలెవరూ బలపరచకుండానే స్వతంత్ర అభ్యర్థిగా ఒకరి నామినేషన్
- నేడు స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతుందన్న అసెంబ్లీ వర్గాలు
- సీఎం సమక్షంలో నామినేషన్లు వేసిన సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి.. ఎన్నిక లాంఛనమే


హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కాంగ్రెస్ పార్టీ వారిద్దరినీ రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేయగా గురువారం శాసనసభ ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. తగినంత సంఖ్యాబలం లేనందున బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల బరిలో ఎవరినీ పోటీకి నిలపలేదు. సాయి అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ 10 మంది ఎమ్మెల్యేలు బలపరచాలనే నిబంధనను పాటించని కారణంగా ఆయన అభ్యర్థిత్వం శుక్రవారం

2లో

## రాజ్యసభకు నితీశ్ నామినేషన్



- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా
- బిహార్‌లో మొత్తం ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లు
- సీఎం పదవి నుంచి తప్పుకుంటున్నట్లు నితీశ్ ప్రకటన
- కొత్త ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని వెల్లడి



## జనాభా నియంత్రణ కాదు.. ఇప్పుడు నిర్వహణే ముఖ్యం

- ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు.. మారిన పరిస్థితులకు తగ్గట్టు కొత్త నినాదం
- రాష్ట్రంలో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోవడం భవిష్యత్తుకు ప్రమాదకరమని వెల్లడి
- ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తామని ప్రకటన
- తెలుగు జాతి శక్తిమంతంగా ఉండాలంటే జనాభా 5 కోట్లకు తగ్గకూడదని ఉద్ఘాటన

గతంలో జనాభా పెరిగితే ఏమవుతుందో అని ఆందోళన చెందాను. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా విధానాలు మార్చుకున్నాం... అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి అసెంబ్లీ వేదికగా పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ప్రకటనపై జరిగిన చర్చలో సీఎం

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


## జగన్ జీతం తీసుకోవడం లేదు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. ఈరోజు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు. సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు. కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులను 'రీకాల్' చేసే హక్కు ప్రజలకు ఉండాలని, దీనిపై చట్ట సవరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం ఏపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా చట్టసభల గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే సీటు వద్ద ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సభ్యుల హాజరును కచ్చితంగా నమోదు చేస్తున్నామని, దీని ద్వారా ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారో రికార్డు అవుతుందని స్పీకర్ వివరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం సీట్లు (18 మంది ఎమ్మెల్యేలు) ఉన్న పార్టీకి మాత్రమే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 సీట్లు ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదని అయ్యన్న పాత్రుడు మరోసారి తేల్చిచెప్పారు.

## తెలంగాణ కొత్త గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లను బదిలీ చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 5న వెలువడిన తాజా ఉత్తర్వుల ప్రకారం.. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ముఖ్యంగా తెలంగాణ గవర్నర్ పదవిలో మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివ ప్రతాప్ శుక్లాను తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా వ్యవహరించిన జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేశారు. రాష్ట్రపతి ఆమోదంతో ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చాయి. పరిపాలనా సౌలభ్యం, వ్యూహాత్మక కారణాల దృష్ట్యా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. కొత్తగా నియమితులైన గవర్నర్లు త్వరలోనే ఆయా రాష్ట్రాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

**రాజ్యసభకు నితీశ్ నామినేషన్**

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ సహా ఐదుగురు గురువారం ఎన్డీయే తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీశ్ కుమార్, జనవరిలో బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నబీన్‌లు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో విధాన సభ సెక్రటేరియట్‌లో అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్లు వేసిన ఎన్డీయే అభ్యర్థుల్లో జేడీయూకు చెందిన కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివేశ్ కుమార్ ఉన్నారు. వీరితోపాటు ఆర్జేడీ బలపరిచిన సిట్టింగ్ ఎంపీ, వ్యాపారవేత్త అమరేంద్ర ధారి సింగ్ సైతం నామినేషన్ వేశారు. ఆయన వెంట ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉన్నారు. సీఎం నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లుగా వార్తలు గుప్పుమన్న రెండు రోజుల్లోనే నితీశ్ రాజ్యసభకు నామినేషన్ వేయడం గమనార్హం. నితీశ్ కుమార్ రాజీనామాతో సీఎం పదవిని బీజేపీ నేత చేపడతారని భావిస్తున్నారు. అదేవిధంగా, ఇంజనీరింగ్ పట్టభద్రుడైన 40 ఏళ్ల నిశాంత్ కొత్త ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా చేరుతారని అంటున్నారు. సీఎం రేసులో ఉన్న వారిలో ప్రస్తుత డిప్యూటీ సీఎం సమ్రాట్ చౌదరి పేరు గట్టిగా వినిపిస్తోంది. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయేను అఖండ విజయం వైపు నడిపించిన నితీశ్ రాజీనామాతో బీజేపీ నేత ఒకరు ఆ పదవిని చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఆ పార్టీ అభ్యర్థి సీఎం పదవిని చేపట్టని ఏకైక హిందీ రాష్ట్రం బిహార్. అయితే, నితీశ్ నిర్ణయాన్ని నిరసిస్తూ జేడీయూ కార్య కర్తలు ఆయన నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 'రాష్ట్ర రాజకీయాలను వదిలి రాజ్యసభకు వెళ్లా లని నితీష్ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయన నిర్ణయంపై పార్టీ కార్యకర్తలు సంతోషంగా లేరు. ఆయన సీఎంగా కొనసాగాలి' అని రాష్ట్ర సున్నీ వక్ఫ్ బోర్డు చైర్మన్, జేడీ(యూ) నేత అల్హాజ్ మొహమ్మద్ ఇర్షాదుల్లా అన్నారు. నితీశ్ ట్వీట్ చూడగానే ఆయన రాసింది కాదని తేలిపోయింది. అది ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశమని అర్థ మైందని ఆర్జేడీ మరో నేత మనోజ్ ఝా వ్యాఖ్యానించారు.

## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామని గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ రూ.16 వేల కోట్లతోనే ఆ పనులు చేయవచ్చని అన్నారు. మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని అన్నారు. పైగా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని అన్నారు. హామీల అమలు కోసమే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని అన్నారు.

# పరుగుల వరదతో ఫైనల్లోకి

ముంబై: టి20 వరల్డ్ కప్‌ను నిలబెట్టుకునే ప్రయత్నంలో భారత జట్టు ఒకే ఒక్క అడుగు దూరంలో నిలిచింది. వరుసగా రెండోసారి మన టీమ్ తుది పోరుకు అర్హత సాధించింది. గురువారం వాంఖడే మైదానంలో హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్ సమరంలో 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి భారత్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది.'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు సామ్సన్ (42 బంతుల్లో 89; 8 ఫోర్లు, 7 సిక్సలు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా... శివమ్ దూబే (25 బంతుల్లో 43; 1 ఫోర్, 4 సిక్సలు), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్సలు) కీలక పరుగులు సాధించారు. అనంతరం ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసి ఓడిపోయింది. జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105; 8 ఫోర్లు, 7 సిక్సలు) సెంచరీతో పోరాడినా జట్టుకు ఓటమి తప్పలేదు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. భారత్, కివీస్ మధ్య టి20 వరల్డ్ కప్ ఫైనల్ జరగడం ఇదే తొలిసారి.



ఓపెనర్ అభిషేక్ శర్మ (9) మరోసారి విఫలమైనా... సామ్సన్, ఇషాన్ భాగస్వామ్యంతో భారత్ దూసుకుపోయింది. ఆర్చర్ తొలి ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన సామ్సన్ అతని రెండో ఓవర్లో కూడా 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. మరోవైపు ఇషాన్ కూడా మూడు ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 67 పరుగులకు చేరింది. డాసన్ ఓవర్లో భారీ సిక్స్‌తో 26 బంతుల్లో సామ్సన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, స్యామ్ కరన్ ఓవర్లో ఇద్దరూ కలిసి 20 పరుగులు రాబట్టారు. రెండో వికెట్‌కు 45 బంతుల్లో 97 పరుగులు జోడించిన తర్వాత ఎట్టకేలకు ఇషాన్‌ను రషీద్ అవుట్ చేశాడు. అయితే స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే వ్యూహంతో బ్యాటింగ్‌లో ముందుగా దూబేను పంపిన భారత్ ఫలితం రాబట్టింది. రషీద్ ఓవర్లో 2 భారీ సిక్సలతో అతను చెలరేగాడు. ఆ తర్వాత ఆర్చర్ ఓవర్లో మరో రెండు సిక్సలు బాదిన సామ్సన్ మరింత దూకుడుగా ఆడే ప్రయత్నంలో వెనుదిరిగాడు. సూర్యకుమార్ (11) ఎక్కువసేపు నిలవలేకపోగా, ఒవర్టన్ ఓవర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్సలు) మూడు ఫోర్లు కొట్టాడు. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21; 3 సిక్సలు) ఏకంగా మూడు భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. 20వ ఓవర్లో పాండ్యా మరో 2 సిక్సలు కొట్టడంతో స్కోరు 250 దాటింది. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 76 పరుగులు సాధించడం విశేషం. భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ఆరంభంలోనే ఫిల్ సాల్ట్ (5) వికెట్ కోల్పోయింది. జోస్ బట్లర్ (17 బంతుల్లో 25; 4 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ బ్రూక్ (7), టామ్ బాంటన్ (17) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. అయితే బెతెల్ మాత్రం పోరాటపటిమ కనబర్చాడు. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతను వరుణ్ చక్రవర్తి ఓవర్లో వరుసగా 6, 6, 6 బాదడం విశేషం.

## జనాభా నియంత్రణ కాదు.. ఇప్పుడు నిర్వహణే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘంగా ప్రసంగించారు. ఒకప్పుడు జనాభా నియంత్రణే పరమావధిగా భావించిన తాము, నేడు జనాభా నిర్వహణ (పాపులేషన్ మేనేజ్ మెంట్) వైపు ఎందుకు అడుగులు వేయాల్సి వచ్చిందో సవివరంగా తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) ప్రమాదకర స్థాయిలో 1.5కి పడిపోయిందని సీఎం గణాంకాలతో సహా వివరించారు. ఇదే ధోరణి కొనసాగితే దక్షిణాది రాష్ట్రాల్లో నెగెటివ్ గ్రోత్ నమోదవుతుందని, భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకునే జనాభా నిర్వహణ విధానాన్ని తెరపైకి తెచ్చామన్నారు. గతంలో మాల్తూషియన్ థియరీ ప్రకారం జనాభా విపరీతంగా పెరిగితే ప్రకృతి వైపరీత్యాలు, కరవు కాటకాలు వస్తాయనే భయం ఉండేదని, అందుకే ఆనాడు కఠినమైన జనాభా నియంత్రణ చర్యలు చేపట్టామని చంద్రబాబు గుర్తు చేశారు. 96-97 ప్రాంతంలో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం 'బ్రేక్ సైలెన్స్' అంటూ ప్రచారాలు నిర్వహించామని, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక విప్లవం, కుటుంబ నియంత్రణ చర్యలతో సామాజికంగా ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. అయితే, నాడు తీసుకున్న ఆ చర్యల ఫలితంగా ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైందని, ప్రస్తుతం జనాభా తగ్గుదల అనేది కొత్త సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పుడు ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే.. ముగ్గురు ముద్దు" అనే కొత్త నినాదాన్ని తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చంద్రబాబు పేర్కొన్నారు. చైనా కేవలం ఒక్క సంతానం విధానంతో ఇప్పుడు వృద్ధాప్య జనాభాతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోందని ఉదహరించారు. ఈ క్రమంలోనే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తామని ప్రకటించారు. కుటుంబంలో ఎక్కువ మంది సభ్యులు ఉండేలా, మైక్రో ఫ్యామిలీస్ స్థానంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. పెద్ద కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్కువ ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో వస్తున్న మార్పులపైనా సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బాల్య వివాహాలు సమస్యగా ఉండేవని, ఇప్పుడు ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వల్ల సంతానలేమి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

## సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!

స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతుందని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. దీంతో రాష్ట్రం నుంచి రాజ్యసభకు పార్టీ హైకమాండ్ ప్రతిపాదించిన సింఘ్వీ రెండోసారి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్నేహితుడు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభలో అడుగుపెట్టడం లాంఛనం కానుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఉదయం 10:30 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి శాసనసభకు వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి రాగా ఆయనతో కలిసి వెళ్లి మరో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి అందజేశారు. సింఘ్వీ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా వేం నరేందర్‌రెడ్డి నాలుగు సెట్లు దాఖలు చేశారు. మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎం నుంచి నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి హాజరైన ఎంఐఎం ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాలా, జుల్ఫికర్ అలీ ఒక సెట్ నామిషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఊహించినట్లుగానే బీఆర్ఎస్ రాజ్యసభ బరిలో అభ్యర్థిని దించలేదు. రాజ్యసభ సభ్యత్వాన్ని పొందేందుకు అవసరమైన 40 మంది శాసనసభ్యుల బలం లేకపోవడంతో పోటీ చేయలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నామినేషన్ దాఖలు అనంతరం వేం నరేందర్‌రెడ్డితో కలిసి గాంధీ భవన్‌కు వచ్చిన అభిషేక్ మను సింఘ్వీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. అనంతరం సింఘ్వీ తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లనుండటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండోసారి తెలంగాణ నుంచి ఎంపీగా తనను ఎంపిక చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు వెళ్లడం ఆనందంగా ఉందని.. ఇప్పటివరకు ఎలా పనిచేశానో, భవిష్యత్తులోనూ అలాగే పనిచేస్తానన్నారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు. తనను రాజ్యసభకు ఎంపిక చేసిన రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడి పెళ్లికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.


# యుద్ధ బీభత్సం



ఇరు పక్షాలూ నౌకలు, నౌకాశ్రయాలను లక్ష్యంగా చేసుకున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా చమురు నౌకపై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. దానికి నిప్పంటుకుని భారీగా మంటలు ఎగసిపడుతున్నట్టు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. బుధవారం శ్రీలంక తీర సమీపంలో తమ యుద్ధనౌకపై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసినందుకు ప్రతీకారంగా ఈ చర్యకు దిగినట్టు వెల్లడించింది. తమ యుద్ధ నౌకను ముంచేసినందుకు అమెరికా తీవ్రంగా పశ్చాత్తాప పడాల్సి వస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి హెచ్చరించారు. ఆ దేశ నౌకలను ఆ స్థాయిలో లక్ష్యం చేసుకుంటామని ప్రకటించిన కాసేపటికే ఐఆర్‌జీసీ నుంచి దాడి వార్త వెలువడింది. అమెరికా మాత్రం తమ చమురు నౌకపై దాడి జరిగినట్టు ధ్రువీకరించలేదు. అంతేగాక దక్షిణ ఇరాన్‌లోని కీలకమైన బందర్ అబ్బాస్ నౌకాశ్రయంపై అమెరికా యుద్ధ విమానాలు భారీస్థాయిలో విరుచుకుపడ్డట్టు తెలుస్తోంది. అక్కడ చాలాసేపటిదాకా భారీ స్థాయిలో పేలుళ్లు వినిపించినట్టు స్థానికులను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెలువడ్డాయి. కీలకమైన హార్మూజ్ జలసంధికి బందర్ అబ్బాస్ అతి సమీపంలో ఉంటుంది. హార్మూజ్‌ను ఇరాన్ ఇక్కడినుంచే నియంత్రిస్తూ ఉంటుంది. మరోవైపు కువైట్‌లో కూడా ఒక చమురు నౌకపై దాడి జరిగింది. దాంతో అందులోని చమురు సముద్రంలోకి ఒలికిపోతున్నట్టు సమాచారం. ఇది కూడా ఇరాన్ పనేనని భావిస్తున్నారు! ఇరాక్‌లోని ఖోర్ అలా జుబెయిర్ నౌకాశ్రయం వద్ద బహమాస్‌కు చెందిన మరో చమురు నౌకపైనా ఇరాన్‌కు చెందిన బోటు ఆత్మాహుతి దాడికి దిగింది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ గల్ఫ్ ప్రాంతంలో దాడుల బారిన పడ్డ చమురు నౌకల సంఖ్య 9కి చేరింది. దఅమెరికా తమ యుద్ధ నౌకను ముంచేసిన కాసేపటికే ఇరాన్ రెచ్చిపోయింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై బుధవారం అర్ధరాత్రి నుంచే దాడులను తీవ్రతరం చేసింది. దాంతో జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాల్లో జనం వేలాదిగా బంకర్లలో తలదాచుకుంటున్నారు. పదులకొద్దీ క్షిపణులు, డ్రోన్లను అడ్డుకుని నేల కూల్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. యూఏఈ, ఖతర్‌తో పాటు దోహాలోని అమెరికా సైనిక స్థావరాలపైనా ఇరాన్ ఎడాపెడా డ్రోన్ దాడులకు దిగింది. ఆరు ఖండాంతర క్షిపణులతో పాటు 125 డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్టు యూఏఈ ప్రకటించింది. అబుదాబిలో డ్రోన్ శకలాలు పడి ఆరుగురు గాయపడ్డారు. దాడుల నేపథ్యంలో దోహాలోని అమెరికా రాయబార కార్యాలయం సమీప ప్రాంతాలను ఖతర్ ఖాళీ చేయించింది. దాడుల తీవ్రత దృష్ట్యా దుబాయ్‌లోని ఎమర్జెన్సీ లాజిస్టిక్స్ హబ్‌లో కార్యకలాపాలను నిలిపేస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గళం విప్పకపోతే యూరప్ దేశాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చరించింది! అంతేగాక తన దాడులను అజర్‌బైజాన్‌కూ విస్తరించడం కలకలం రేపుతోంది. నఖ్చివాన్‌లో విమానాశ్రయంతో పాటు ఓ స్కూలు వద్దా పేలుళ్లు సంభవించాయి. దాంతో ఇరాన్ సరిహద్దుల సమీపంలో గగనతలాన్ని అజర్‌బైజాన్ మూసేసింది. తమపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులు జరిగాయంటూ మండిపడింది. ఇందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అధ్యక్షుడు ఇల్హాం అలియేవ్ డిమాండ్ చేశారు. మరోవైపు అమెరికా ఎఫ్15ఈ యుద్ధ విమానం ఇరాన్‌లో కుప్పకూలినట్టు వార్తలొచ్చాయి. వాటిని యూఎస్ సెంట్రల్ కమాండ్ మాత్రం ఖండించింది. పశ్చిమాసియా దేశాల నుంచి ఐదు రోజులుగా దాదాపుగా పడకేసిన విమాన సర్వీసులు గురువారం పాక్షికంగా కొనసాగాయి. ఒమన్, ఖతర్ తదితర దేశాలు పలు సర్వీసులను నడిపాయి. దాంతో ఆయా దేశాల్లో చిక్కుబడ్డ యూరప్ తదితర దేశాలకు చెందిన వేలాదిమంది తిరుగు ప్రయాణమయ్యారు. యుద్ధ కల్లోలం ఇప్పటికే ఆందోళనలు రేకెత్తిస్తున్న వేళ ఇరాన్ ఉద్రిక్తతలను మరింతగా పెంచే ప్రకటనలకు దిగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు ఇజ్రాయెలీల రక్తం కూడా కళ్లజూడాలంటూ ఇరాన్ మత పెద్ద అయతొల్లా అబ్దొల్లా జావేదీ అమోలీ ఏకంగా ప్రభుత్వ వార్తా చానల్లోనే దేశవాసులకు పిలుపునిచ్చారు.

# బైక్ దొంగల ముఠా అరెస్ట్.. రెండు వాహనాల స్వాధీనం

**- తనిఖీల్లో పట్టుబడ్డ నిందితులు.. రిమాండ్‌కు తరలింపు**


**చౌటుప్పల్, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న రెండు వేర్వేరు బైక్ దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చౌటుప్పల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 4న డి. నాగారం గ్రామానికి చెందిన సయ్యద్ గాలిబ్ (28), పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో వలిగొండ ఎక్స్ రోడ్ వద్ద ఉన్న హెచ్‌డీ వైన్ షాప్ ఎదుట తన స్ప్లెండర్ బైక్ (టీఎస్ 05 ఈఎల్ 8658) పార్క్ చేసి వెళ్లగా, సుమారు అరగంట తరువాత వచ్చేసరికి వాహనం కనిపించలేదని పేర్కొన్నారు. అలాగే, లక్కారం గ్రామంలో నివసిస్తున్న సుభ్రమాన్ గుజర్ (38) తన యాక్టివా ఎలక్ట్రిక్ వాహనం (టీఎస్ 08 ఈవీ 8673) మార్చి 4న రాత్రి 11 గంటలకు ఇంటి ముందు పార్క్ చేసి నిద్రపోయిన తరువాత, మార్చి 5న ఉదయం లేవగానే వాహనం గల్లంతైనట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బతుల మణి (20), తమ్మిశెట్టి పెద్దిరాజు (34), కందగట్ల కిరణ్‌లను నిందితులుగా గుర్తించారు. వీరు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు ప్రాంతానికి చెందినవారని తెలిపారు. తంగడపల్లి ఎక్స్ రోడ్, వలిగొండ ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు పంపినట్లు సీఐ జి. మన్మథ కుమార్ వెల్లడించారు.

# యాదాద్రి జిల్లాను కన్న ఊరిలా భావిస్తా..

- మర్చిపోలేని మధుర జ్ఞాపకం యాదాద్రి..
- జిల్లా ప్రజల ప్రేమాభిమానాలు మరువలేను: హనుమంతరావు
- అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమైంది..
- కలెక్టరేట్‌లో పూర్వ కలెక్టర్‌కు అధికారుల ఘన వీడ్కోలు.
- ఒక సంవత్సరం నాలుగు నెలల కాలం చిరస్మరణీయం.
- అక్కున చేర్చుకున్న యాదాద్రి గడ్డ - భావోద్వేగానికి లోనైన మాజీ కలెక్టర్.



**యాదాద్రి భువనగిరి, మార్చి 5 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసే గొప్ప అవకాశం దక్కడం తన అదృష్టమని, ఇక్కడి ప్రజలు తనను కన్న ఊరి బిడ్డలా అక్కున చేర్చుకున్నారని పూర్వ కలెక్టర్ హనుమంతరావు భావోద్వేగానికి లోనయ్యారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఆయన 'ఆత్మీయ వీడ్కోలు' సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. జిల్లాలో తాను పనిచేసిన ఏడాది నాలుగు నెలల కాలం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. అధికారుల సమన్వయం, కిందిస్థాయి సిబ్బంది అంకితభావంతోనే జిల్లా సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయగలిగానని తెలిపారు. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. హనుమంతరావు జిల్లా అభివృద్ధికి వేసిన పునాదులు, వారి పనితీరు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం జిల్లా అధికారులు, టీఎన్జీవో, టీజీవో సంఘాల ప్రతినిధులు హనుమంతరావును ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓలు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జెడ్పీ సిఈఓ శోభారాణి, డిఆర్ఓ జయమ్మ, టీజీఏ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, డిఆర్డీఓ నాగిరెడ్డితో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, టీఎన్జీవో, టీజీవో సంఘాల ప్రతినిధులు, ఎంపీడీవోలు, తహసీల్దారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కుప్పకూలిన గీతన్న బతుకు.. గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**ప్రభుత్వ సాయం కోసం రఘునాథపురం గ్రామస్తుల విన్నపం**




**రాజపేట, మార్చి 5 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని రఘునాథపురం గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచి పడి మార్క నర్సింలు (44), అనే గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. నర్సింలు గీత వృత్తిలో భాగంగా చెట్టు ఎక్కుతుండగా కాలు జారి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన వెన్నుపూసకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆయన్ను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# సమాజ సేవలో రమేష్ కృషి భేష్

**- మదర్ డెయిరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్**

**రాజపేట, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** రాజాపేట మండలాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఉప్పల రమేష్ చేస్తున్న కృషి ఎందరికో ఆదర్శమని మదర్ డెయిరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్ కొనియాడారు. గురువారం జర్నలిస్టుల ఫోరం మండల అధ్యక్షుడు, శ్రీ రామకృష్ణ సాయి మందిరం ట్రస్ట్ సభ్యుడు ఉప్పల రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిజంతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో రమేష్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి ఫోన్ ద్వారా రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ ఇంజన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డల పెళ్లిళ్లకు 'బీర్ల' భరోసా




**- పుట్టింటి కానుకలు అందజేసిన చైర్‌పర్సన్ అనిత**

**యాదగిరిగుట్ట, మార్చి 5 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయంలో బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో పలువురు ఆడబిడ్డల వివాహాలకు గురువారం వివాహ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత పాల్గొన్నారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన గర్దాసు రమ్య - క్రాంతికుమార్ దంపతుల కుమార్తె వివాహానికి, యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన ఆలకుంట్ల లక్ష్మీ - యాదగిరి దంపతుల కుమార్తె వివాహానికి, మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన వంగా లలిత రమేష్ దంపతుల కుమార్తె వివాహానికి వివాహ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల అనిత మాట్లాడుతూ.. బీర్ల ఫౌండేషన్ ద్వారా అవసరమైన కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని తెలిపారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తోడ్పాటు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# "గ్రామానికి నేనే బాస్" అంటున్న పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

**- అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ సర్పంచి ఆరోపణలు**



**రాజపేట, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలం బేగంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంజ దేవమణి గ్రామ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ సర్పంచి ఇండ్ల అనూష సుమన్ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు పత్రాన్ని అందజేసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి 15వ ఫైనాన్స్ కింద రూ.7.05 లక్షలు మంజూరయ్యాయని, పాత పాలకవర్గానికి రావలసిన బకాయిలు చెల్లించిన తర్వాత మిగిలిన నిధులను గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు విడుదల చేయాలని తాము కోరామని తెలిపారు. ఇందుకు సంబంధించి తీర్మానం చేయాలని కోరినప్పటికీ పంచాయతీ కార్యదర్శి ఇంజ దేవమణి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కుంటి సాకులు చెబుతున్నారని ఆరోపించారు. "గ్రామానికి నేనే బాస్, నేను చెప్పిందే వేదం" అంటూ కార్యదర్శి మాట్లాడుతున్నారని సర్పంచి ఆరోపించారు. గ్రామ అభివృద్ధికి అడ్డంకులు కలిగిస్తున్న ఆమెపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లగా ఎంపీడీవో, ఎంపీవోలు అందుబాటులో లేరని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామ అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూడాలని సర్పంచి ఇండ్ల అనూష కోరారు.





# ఇష్టపడి చదవండి.. విజేతలుగా నిలవండి!


**- సెయింట్ జెకారియా పాఠశాల కరస్పాండెంట్ జాన్ గొల్లపల్లి**



**రాజపేట, మార్చి 5 (తొలివెలుగు న్యూస్):** విద్యార్థులు ఇష్టంతో చదువుకుని జీవితంలో మంచి విజయాలు సాధించాలని సెయింట్ జెకారియా స్కూల్ జాల కరస్పాండెంట్ బిషప్ జాన్ గొల్లపల్లి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల దశలోనే చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. ఇష్టపడి చదివినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. జీవితంలో ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో మంచి స్థానాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో స్కూల్ కోఆర్డినేటర్ మన్నె వినయ్ కుమార్, ఉపాధ్యాయులు భగత్ సింగ్, యాకుబ్, నాగేందర్ రెడ్డి, కృష్ణ భాయి, నాగేశ్వర్, రాధిక, శ్రీనివాసులు, కళ్యాణి, అశోక్, పల్లవి, సౌజన్య, రమ్య, శిరీష, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల అండ

**- రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేత**



**రాజపేట, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** ఆపదలో ఉన్న తోటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి రాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన రేగొండ వరదరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన పాఠశాల మిత్రులు గురువారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం తమ వంతు సాయంగా రూ. 20 వేల నగదును అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్, సర్పంచ్ కొండా ప్రమీల పాండరి, మాజీ సర్పంచ్ కర్ల కరుణాకర్ రెడ్డి, నాయకులు కడవెరుగు శ్రీశైలం, జాప నర్సింలు, బాల నరసయ్య, ఎరువ సత్తిరెడ్డి తదితరులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





# పాఠశాల పాలన.. విద్యార్థుల పరం

- కలెక్టర్‌గా మహిమ, హెచ్ఎంగా వైష్ణవి.
- లింగోజిగూడెం జెడ్‌పీహెచ్ఎస్‌లో సందడిగా 'సెల్ఫ్ గవర్నమెంట్ డే'



**చౌటుప్పల్, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ మండలంలోని లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'స్వయం పాలన దినోత్సవం' (సెల్ఫ్ గవర్నమెంట్ డే) వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఒక్కరోజు పాఠశాల పాలనా పగ్గాలను విద్యార్థులే చేపట్టి, తమలోని నాయకత్వ పటిమను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఉన్నతాధికారుల పాత్రలను పోషిస్తూ తరగతులను నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌గా విద్యార్థిని మహిమ, జిల్లా విద్యాశాఖాధికారిగా (డీఈవో) రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా (హెచ్ఎమ్) వైష్ణవి బాధ్యతలు స్వీకరించి అందరినీ ఆకట్టుకున్నారు. వీరు పాఠశాలలోని వివిధ తరగతులను సందర్శించి, విద్యాబోధన తీరును పర్యవేక్షించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కురెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో బాధ్యతాయుత భావన, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే స్వయం పాలన దినోత్సవం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయుల వృత్తి పట్ల అవగాహన కల్పించడంతో పాటు, భవిష్యత్తులో వారు సమాజంలో కీలక బాధ్యతలు చేపట్టేలా ప్రోత్సహించడానికి ఇలాంటి వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవ రెడ్డి, అరుణ, పురుషోత్తమాచారి, విజయలక్ష్మి, రమేష్ రెడ్డి, బండి అనిల్ కుమార్ రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించగా, తోటి విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొడుకును నరికి చంపిన తండ్రి

ఇందల్వాయి (నిజామాబాద్ రూరల్): మత్తు వ్యసనాలకు బానిసైన కొడుకును ఒక తండ్రి గొడ్డలితో నరికి చంపాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. నల్లవెల్లికి చెందిన కొత్తగొల్ల లక్ష్మి, కిషన్ దంపతులకు ఇద్దరు కొడుకుల్లో భాను ప్రకాశ్ (23) చిన్నవాడు. పదో తరగతి వరకు చదివిన భాను ప్రకాశ్ పైచదువులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. అయిదారేళ్లుగా చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు బానిసై తల్లిదండ్రులను వేధిస్తూ జులాయిగా తిరుగుతున్నాడు. భాను ప్రకాశ్ తరచూ గొడవ పడటంతో.. అతని అన్న గ్రామాన్ని విడిచి హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నాడు. తల్లిదండ్రులు కొద్ది రోజులుగా వేరే వారి ఇంట్లో తలదాచుకుంటున్నారు. ఈ క్రమంలో కొడుకుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న తండ్రి కిషన్ ఇంట్లో నిద్రిస్తున్న భానుప్రకాశ్‌ను బుధవారం అర్ధరాత్రి గొడ్డలితో నరికి చంపాడు. ఉదయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నామని ఎస్ఐ సందీప్ తెలిపారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

# రూ.25కోట్లతో ఉడాయింపు

వనస్థలిపురం, మార్చి 5 : అధిక వడ్డీ ఆశ చూపి, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేసి రూ.లక్షల్లో వసూలు చేసిన ఓ ఘరానా లేడీ రూ. 25కోట్లకు పైగా వసూలు చేసి ఉడాయించిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కమలానగర్‌లో ఉన్న తన సొంత ఇంటిని ఒకరికి అగ్రిమెంట్ చేసి, మరొకరికి సేల్ డీడ్ చేసింది. ఇల్లు తమదంటే తమదని ఇరు వర్గాలు ఘర్షణకు దిగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. డబ్బులు దండుకున్న సదరు మహిళ మాత్రం ఎవరికి దొరకకుండా తిరుగుతోంది. భర్త, కూతురును అమెరికాకు పంపించి ఆమె మాత్రం జల్సాలు చేస్తోందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంధువులు, స్నేహితుల వద్ద నుంచి తెచ్చి డబ్బులు ఇచ్చామని, తమకు ఆత్మహత్యే శరణ్యమని బాధితులు పేర్కొంటున్నారు. వనస్థలిపురం కమలానగర్‌లో ఉండే బద్దం జ్యోతిరెడ్డి వనస్థలిపురం ప్రాంతంలో బాగా పరిచయాలు, పలుకుబడి ఉంది. రాజకీయంగా, సామాజికంగా ప్రజల్లో తిరుగుతూ ఉండేది. భర్త ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేసేవాడు. జ్యోతిరెడ్డి స్థానికంగా ఉన్న కొంతమందికి రూ.10వరకు వడ్డీ ఇచ్చేలా అప్పులు తీసుకుంది. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడుతున్నానని నమ్మించి ఒక్కొక్కరి వద్ద నుంచి లక్షల్లో వసూలు చేసింది. కొంత మంది రూ.3 కోట్ల వరకు కూడా ఇచ్చినట్లు బాధితులు పేర్కొంటున్నారు. కొన్ని రోజులు వడ్డీ సరిగ్గా చెల్లించిన జ్యోతిరెడ్డి ఆ తర్వాత మరి కొంత డబ్బు కావాలని లక్షల్లో అప్పు చేసింది. బాధితులు తమ డబ్బు ఇవ్వాలని అడిగితే రేపు, ఎల్లుండి అంటూ గడిపింది. దీంతో బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో కమలానగర్‌లో తన సొంత ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. దీంతో బాధితులు ఆమె ఇంటి గేట్‌పై కనబడుటలేదు అని ఫ్లెక్సీ కూడా అంటించి నిరసన తెలిపారు. తన ఇంటిని సుజిత్ అనే వ్యక్తికి సేల్ అగ్రిమెంట్ చేసింది. ఆ తర్వాత ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన రామకృష్ణారెడ్డికి సేల్‌డీడ్ చేసింది. కిలేడీ చేసిన మోసంపై పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. జ్యోతిరెడ్డి ఇంట్లో అగ్రిమెంట్ చేసుకున్న సుజిత్ బంధువులు ఉంటున్నారు. కాగా బుధవారం రాత్రి సేల్ డీడ్ చేసుకున్న రామకృష్ణారెడ్డి ఇల్లు తమకు రిజిస్ట్రేషన్ అయ్యిందని, ఇంటిని తమకు ఇవ్వాలని అడిగారు. ఇరు వర్గాలు గొడవలు పడ్డారు. స్థానికుల సమాచారంతో రంగప్రవేశం చేసిన పోలీసులు అక్కడున్న వారిని పంపించి వేశారు. ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. జ్యోతిరెడ్డి వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు.

# ప్రకృతి సాగుతోనే రైతుకు రక్ష




- రసాయనాలు వీడండి.. ప్రకృతి సాగు పట్టండి
- దేశవాళీ విత్తనాలతోనే మేలు: శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి
- రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు
- మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్
- వైస్ చైర్మన్ గోశిక వినయ్

**చౌటుప్పల్, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ రైతు వేదికలో గురువారం రైతులకు ప్రకృతి వ్యవసాయం (నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు స్థానిక దేశవాళీ విత్తనాలను సేకరించి వాటిని వినియోగించుకోవాలని సూచించారు. సేంద్రియ పద్ధతిలో కనీసం 10 గుంటలైనా తమ కుటుంబ అవసరాలకు సరిపడా వరి పంటను పండించాలన్నారు. రసాయనాలపై ఆధారపడకుండా జీవామృతం, ఘన జీవామృతం వంటి సేంద్రియ ద్రావణాలను రైతులే తయారు చేసుకుని ఉపయోగించుకోవాలని తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించి దాని బదులుగా వేపపిండి ఉపయోగిస్తే వరి పంటలో కంకులు ఒకేసారి రావడంతో పాటు చీడపీడల ఉధృతి తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులు పూర్వపు పద్ధతులను అనుసరించి సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. వైస్ చైర్మన్ గోశిక వినయ్ మాట్లాడుతూ.. తంగడపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేయాలని కోరారు. పెద్దకొండూరు గ్రామానికి చెందిన రైతు వాకిటి రజిత గత పది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ వచ్చిన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉదరి యాదయ్య, ఆలె శ్రీలత చిరంజీవి, తంగడపల్లి గ్రామ రైతులు, కృషి సఖీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.








# ఘనంగా భట్టి తనయుని వివాహం

హైదరాబాద్ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్యసాక్షిల వివాహం శంషాబాద్ జీఎంఆర్ ఏరీనాలో గురువారం ఘనంగా జరిగింది, వధూవరులను ఆశీర్వదించడానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా పలువురు సీనియర్ రాజకీయ నాయకులు, సినీ తారలు వచ్చారు. వారందరినీ డిప్యూటీ సీఎం ఆప్యాయంగా పలకరించారు. వివాహ వేడుకకు హాజరైనవారిలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ సంతోశ్‌కుమార్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సినీ ప్రముఖుల్లో చిరంజీవి, నాగార్జున, శ్రీకాంత్, తనికెళ్ల భరణి, పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ సీనియర్ అధికారులు ఉన్నారు.

# అప్పులు చేయొద్దని తల్లి మందలించిందని.. మనస్తాపంతో ఉరి వేసుకున్న కొడుకు, కోడలు

నవాబుపేట: అప్పులు ఎక్కువగా చేస్తున్నారని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు తన భార్యతో కలిసి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనలో భార్య మృతిచెందగా.. ఆ యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం జంగమయ్యపల్లిలో ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. జంగమయ్యపల్లికి చెందిన మురగని రవి (25), లావణ్య (23) భార్యాభర్తలు. రవి కొంతకాలంగా ఎక్కువగా అప్పులు చేస్తుండటంతో బుధవారం రాత్రి అతడి తల్లి పద్మమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రవి భార్య లావణ్యతో పాటు 11 నెలల కూతురిని తీసుకుని పొలానికి వెళ్లాడు. రాత్రి పొలంలోనే వారు నిద్రించారు. గురువారం ఉదయం రవి తన సోదరుడు ఆనంద్‌కు వీడియో కాల్ చేసి.. చెట్టుపై తాను, తన భార్య కూర్చున్నామని, తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని చెప్పి ఫోన్ కట్ చేశాడు.

వెంటనే అప్రమత్తమైన ఆనంద్ గ్రామస్తులతో కలిసి పొలానికి వెళ్లి చూడగా.. దంపతులిద్దరూ చెట్టుకు వేలాడుతూ కనిపించారు. వారిని కిందికి దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే లావణ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రవి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై లావణ్య తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి



**ఆలేరు, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. గురువారం ఆలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థుల తీరును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి హాజరు వివరాలు, సీసీ కెమెరాల పనితీరు, తాగునీటి సదుపాయం, వైద్య సేవలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.ద

## పులిగిల్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- సంఘ బంధం, అంగన్‌వాడీ భవనాలకు భూమిపూజ
- ఉపాధి హామీ నిధులతో పులిగిల్ల గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**వలిగొండ, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సంఘ బంధం భవనం, అంగన్వాడీ భవనం నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ వేముల అనూష, పల్లెర్ల మల్లేష్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 10 లక్షల రూపాయల వ్యయంతో సంఘ బంధం భవనం, 12 లక్షల రూపాయలతో అంగన్వాడీ భవనం నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేముల అనూష మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సందీప్, ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, వార్డు సభ్యులు కానుగంటి పాండు, బుగ్గ కృష్ణ, పర్వతం సంతోష్, వేముల నాగరాజు, దొడ్డి స్వర్ణలత, పిన్నింటి ఉమారాణి, మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, బుగ్గ దేవమ్మ, గ్రామ కార్యదర్శి జోగు సైదులు, బుగ్గ వెంకటేశం, పాశం స్వామి, జక్కా దామోదర్ రెడ్డి, బుగ్గ బీరప్ప, బుగ్గ మనోజ్, పర్వతం రాజు, తేరాల మల్లయ్య, నక్కల నరేందర్ రెడ్డి, వేముల నరసింహ, బుగ్గ మధు, బందారపు నరేష్, సంఘ బంధం సభ్యులు, అంగన్వాడీ టీచర్ బందారపు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ లో ఆరోగ్య లక్ష్మి సమావేశం

**నూతనకల్(తొలివెలుగు న్యూస్) :** మండలంలోని సోమ్లాతండా అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఆరోగ్య లక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ పద్మ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆహారంలో ఆకుకూరలు, పప్పు, గుడ్లు తప్పనిసరిగా చేర్చుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గుగులోత్ కమల, భారతి, పంచాయతీ కార్యదర్శి బి.వెంకన్న,చిన్నారుల తల్లులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# సాంకేతిక నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి





- ఆధునిక కోర్సులపై పట్టు సాధించాలి: యువతకు కలెక్టర్ పిలుపు.
- ఆలేరు ఏటీసీ, ఐటీఐల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.
- రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్టరింగ్ శిక్షణపై ప్రత్యేక ఆరా.
- విద్యార్థులతో ముఖాముఖి.. ఇంటర్న్‌షిప్ అవకాశాలపై ఆరా తీసిన కలెక్టర్.
- మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి.

**ఆలేరు, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు సాంకేతిక విద్య ఎంతో అవసరమని, ఆధునిక టెక్నాలజీపై పట్టు సాధించినప్పుడే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం ఆలేరు మండలంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌లో నిర్వహిస్తున్న వివిధ కోర్సుల వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ట్రైనర్లతో నేరుగా మాట్లాడి శిక్షణ విధానంపై సమాచారం సేకరించారు. సెంటర్‌లో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారో, వారు రెగ్యులర్‌గా హాజరవుతున్నారో తెలుసుకున్నారు. శిక్షణ పూర్తైన తర్వాత ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, అడ్వాన్స్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ వంటి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆలేరు ఐటీఐను సందర్శించి అక్కడ బోధిస్తున్న కోర్సుల వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మండల తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## లక్ష్యసాధన కోసం విద్యార్థులు నిరంతరం శ్రమించాలి



- ఎస్సీ బాలికల గురుకులంలో కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

**ఆలేరు, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం ఆలేరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో మొత్తం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో, ఇంటర్మీడియట్‌లో ఎంతమంది ఉన్నారో ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయుల సంఖ్య, వారు హాస్టల్‌లోనే ఉంటున్నారా లేదా వచ్చి వెళ్తున్నారా అనే విషయాలపై కూడా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఆ రోజు మెనూ ప్రకారం భోజనం వండుతున్నారా లేదా అనే విషయాన్ని తనిఖీ చేసి, భోజనం రుచిగా ఉందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, కూరగాయలు, ఇతర వంట సరుకులను పరిశీలించారు. కూరగాయలు, గుడ్లు తాజాగా ఉన్నాయా అనే విషయాన్ని కూడా తనిఖీ చేశారు. ఆర్వో వాటర్ ఫిల్టర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతను నిరంతరం పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.








## రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

- అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డికి మద్దతు తెలిపిన రాజగోపాల్ రెడ్డి



**హైదరాబాద్/ చౌటుప్పల్, మార్చి 5 (తొలివెలుగు న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించిన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డిలకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో గురువారం అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై అభ్యర్థులకు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల విజయానికి తన మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీరు సీసాతో యువకుడిపై దాడి

**మిర్యాలగూడ (తొలివెలుగు న్యూస్) :** మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్ కాలనీలో బీరు సీసాతో యువకుడిపై దాడి జరిగిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పాత గొడవను కారణంగా చూపుతూ ఇద్దరు అన్నదమ్ములు ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.వన్‌టౌన్ సీఐ నాగభూషణరావు వివరాల ప్రకారంఉ కాలనీకే చెందిన ఎల్తూరి అఖిల్ వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, అదే ప్రాంతానికి చెందిన పందిరి ఆకాశ్, వికాస్‌లు హోలీ రోజు జరిగిన గొడవను ప్రస్తావిస్తూ అతనితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.అఖిల్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా, ఆకాశ్ బీరు సీసాతో దాడి చేసి అతని మెడపై పొడిచినట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన అఖిల్‌ను అదే సమయంలో అక్కడుగా వెళ్తున్న చెరుకుపల్లి సురేష్ తన బైక్‌పై ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడినట్లు తెలిసింది.

# చేదు జ్ఞాపకం



ఒకప్పుడు సౌత్‌సినీ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసిన హీరోయిన్ స్నేహ. షార్ట్‌టైంలోనే ఎన్నో సూపర్ హిట్ సినిమాలతో మెప్పించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది. గ్లామర్ షోకు దూరంగా పద్దతిగా కనిపిస్తూనే ఫ్యామిలీ ప్రేక్షకులకు దగ్గరైంది ఈ అమ్మడు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే తమిళ హీరో ప్రసన్నతో ప్రేమలో పడిన స్నేహ.. 2012లో రెండు కుటుంబాల సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. వీరికి బాబు, పాప ఉన్నారు. అయితే మ్యారేజీ తర్వాత సినిమాలకు దూరంగా ఉన్న ఆమె.. ఆ తర్వాత రీఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు మరోసారి మూవీలకు గ్యాప్‌ఇవ్వడం వెనుక ఒక చేదు జ్ఞాపకం దాగి ఉందని తాజాగా  ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది స్నేహ. 'నా కెరీర్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న టైంలో ఒక ఘోర ప్రమాదానికి గురయ్యా. నా కాళ్లు, చేతులు, వీపు భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కనీసం లేచి నిలబడాలన్నా 8 నెలలకు పైగా సమయం పడుతుందని డాక్టర్లు తేల్చి చెప్పడంతో తీవ్ర మానసిక వేదనకు లోనయ్యా. ఇక ఇంతటితో నా కెరీర్ ముగిసిపోయిందని అనుకున్న. కానీ డైరెక్టర్ కరు పళనియప్పన్ 'పార్థిబన్ కనవు' కథతో నన్ను సంప్రదించాడు. అసలు కదల్లేని స్థితిలో ఉన్న అని తెలిసి కూడా చిత్రం కోసం పిలవడం చూసి షాకయ్యా. కానీ ఆ దర్శకుడు ఇచ్చిన ధైర్యం, చూపించిన నమ్మకమే మళ్లీ నన్ను కోలుకునేలా చేసింది' అంటూ స్నేహ ఎమోషనల్ అయ్యింది.




## కారు డ్రైవర్ జీవన ప్రయాణం

సముద్రఖని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కార్మేని సెల్వం'. రామ్‌చక్రి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ డైరెక్టర్ గౌతమ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అరుణ్ రంగరాజులు నిర్మాత. ఏప్రిల్ 3న తమిళ, తెలుగు భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. పీవీఆర్ ఐకాన్స్ పిక్చర్స్ థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ పార్ట్‌నర్‌గా ఉంది. సెల్వం అనే సాధారణ కారు డ్రైవర్ జీవితం చుట్టూ తిరిగే కథ ఇదని, ఆధునిక సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్ల మధ్య అతని ప్రయాణం ఎలా సాగిందన్నది భావోద్వేగభరితంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. నిజాయతీపరుడైన ఓ సామాన్యుడి కథగా మెప్పిస్తుందని దర్శకుడు పేర్కొన్నారు. లక్ష్మీప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోదండం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మ్యూజిక్ క్లౌడ్ స్టూడియో అండ్ టెక్నాలజీ, కథ, దర్శకత్వం: రామ్ చక్రి.





# 'NBK111'లో విలన్‌గా?



'మిరాయి'లో విలన్‌గా నటించి మిరాకిల్ సక్సెస్‌ని అందుకున్నారు మంచు మనోజ్. ఆ సినిమా విజయంలో మనోజ్ పాత్ర కీలకం అని చెప్పడంలో సందేహించాల్సిన పనిలేదు. 'మిరాయి' విజయం తర్వాత ఆఫర్లు పోటెత్తినా, ఆచీతూచీ సినిమాలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు మనోజ్. ఈ నేపథ్యంలో ఓ అద్భుతమైన అవకాశం ఆయన తలపు తట్టిందనేది ఫిల్మ్‌నగర్ టాక్. 'చీదీఖ111'(వర్కింగ్ టైటిల్)లో కీలకమైన పాత్ర కోసం దర్శకుడు మలినేని గోపీచంద్ ఇటీవలే మంచు మనోజ్‌ని కలిశారట. బాలకృష్ణ సినిమాలో ప్రత్యేక పాత్ర అనగానే మారు మాట్లాడకుండా అగ్రిమెంట్‌పై సంతకం చేశారట మంచు మనోజ్. ముంబయ్ అండర్‌వరల్డ్ మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆయన ప్రధాన విలన్‌గా నటిస్తున్నట్టు కూడా వార్తలొస్తున్నాయి. బాలకృష్ణ సినిమాలో మెయిన్ విలన్‌గా చేసే అవకాశం రావడమంటే నిజంగా అది జాక్‌పాటే. గతంలో మనోజ్ హీరోగా నటించిన 'ఊ కొడతారా ఉలిక్కి పడతారా' చిత్రంలో బాలకృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో నటించిన విషయం తెలిసిందే.

# గ్లామరస్ నిధి

గ్లామరస్ నటి, మోడల్ అయిన నిధి అగర్వాల్ మరోసారి తన స్టన్నింగ్ ఫోటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. బ్లాక్ కలర్ షీర్ హాల్టర్‌నెక్ కార్సెట్ టాప్‌కు లేస్, బీడ్‌వర్క్ జోడించి, ఫ్లోయింగ్ స్కర్ట్‌తో ఆమె లుక్ హై-ఫ్యాషన్ వైబ్ ఇచ్చింది. మెరిసే బ్యాంగిల్స్, పెద్ద హూప్ ఇయర్‌రింగ్స్, రింగ్స్‌తో స్టైలింగ్ పూర్తి చేయగా, ఈ లుక్ కాన్ఫిడెన్స్, సెన్సువాలిటీని హైలైట్ చేస్తోంది.  1993 ఆగస్టు 17న హైదరాబాద్‌లో జన్మించిన నిధి, బెంగళూరులో పెరిగారు. మిస్ దివా యూనివర్స్ 2014లో పాల్గొన్న ఆమె, 2017లో విడుదలైన మున్నా మైఖేల్తో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసి జీ సినీ అవార్డు ఉత్తమ నూతన నటి పురస్కారం అందుకుంది. 2018లో సవ్యసాచితో టాలీవుడ్ లోకి ప్రవేశం చేసి, ఇస్మార్ట్ శంకర్, హీరో, కలగ తలైవన్ వంటి చిత్రాల్లో నటించింది.  గతేడాది పవన్ కల్యాణ్ సరసన హరి హర వీర మల్లులో పంచమి పాత్రతో నటించింది. 2026లో విడుదలైన ది రాజా సాబ్ లో  బేసీ పాత్రతో మరోమారు ప్రేక్షకుల మనసుదోచిందీ చిన్నది.  ప్రస్తుతం ఒక తెలుగు, రెండు హిందీ చిత్రాలతో బిజీగా ఉన్న నిధి, భవిష్యత్తులో రొమాంటిక్, పీరియడ్ లవ్ స్టోరీల్లో నటిస్తానని చెబుతోంది.